# గాజు కళ్ళు

దేవుడున్నాడూ?
ఏమో! ఎప్పుడూ కనపళ్ళేదు మరి.
పోనీ, దేవుళ్ళాంటి మనుషులు?
వాళ్ళూ కనబడనట్టే గుర్తు....

*    *    *    *

ఓసారి ఆకాశం నల్లగా వున్నప్పుడు, సాయంత్రం ఆరైనప్పుడు, మనసేవంత బావులేనప్పుడు....చినుకులూ, తలనొప్పీ ఒకేసారి మొదలయ్యాయి. అందువల్ల మహారాజు కూతురి మెళ్ళో మణిహారంలా మెరుస్తున్న మెయిన్రోడ్డుమీద నడుస్తున్న నేను, ఒక్కసారి తృళ్ళిపడ్డాను. పది, పదడుగుల దూరంలో వున్న హోటల్లో దూరాను. సాయంత్రమవడం వల్ల హోటలంతా చాలారద్దీగా వుంది. అక్కడ ట్యూబ్లైట్లు వెలుగెంత బావుందో, ఆ గొడవా హడావుడీ అంత బావులేదు. అప్పుణ్నా అదృష్టం చాలా బావుండడం వల్ల సీటోటి దొరికింది. వెంటనే ఆలస్యం చేయకుండా కూర్చొన్నాను. అలా కూర్చున్నాక చుట్టూ చూసేను. ఇంతలోనే ఎదురుగా నీలంగా మెరిసిన టెర్లిన్ చొక్కా హుంకరించటం చూసి, ఎదురుగా చూశాను.

"అంతే సార్! నో కల్చర్! నో క్విక్నెస్! వచ్చి గంటైంది! ఇప్పటిదాకా ఎవడైనా వచ్చాడా! వచ్చి మన సంగచ్చూసేడా, ఫారిన్లో ఐతే సార్; ఏం క్విక్ సర్వీసండీ, ఓహ్! ఎందుకు టేక్ ది కేసాఫ్

బోంబే ఆరెనీ అదర్ బిగ్ సిటీ. అబ్బబ్బ వాటితో కంపేర్ చేస్తే మన వెఁక్కడ వుయా ర్ఫుల్లీ బాక్వర్డ్...."

ఇక్కడాగి. ఆయ న్నాపక్క చూసేడు. యేదో ముఖపరిచయం వుండటంవల్ల 'హలో' అని నేను పలకరించేను. అతనుకూడా పలకరించి లెక్చర్ కంటిన్యూ చేయబోయేడు. అతని పక్కనున్న మరో తెల్ల టెర్లిన్ చొక్కా కాస్త సకిలించి "యేం వున్నాయి?" అనడం విని, మేవూఁ పక్కకి చూసేం. సప్లయరక్కడ నిలబడున్నాడు. ఆ సప్లయరంటే చాలా యిష్టం నాకు, ఎందుకో అతన్ని చూస్తే ప్రపంచంలో వున్న అతి కొద్దిమంది మంచివాళ్ళల్లోనూ ఇతనొకడని అనిపిస్తుంది నాకు. అంచేత నవ్వుతూనే వో కాఫీ చెప్పి అతన్నవ్వునుకూడా పుచ్చుకున్నాను.

నేను వూరుకున్నాను. నీలం టెర్లిన్ చొక్కా ఆయన కూడా 'కాఫీ' చెప్పి నాపక్క తిరిగాడు. అప్పుడతన్ని పరీక్షగా చూసిన్నాకు చాలా గౌరవం కలిగింది. అతని టెర్లిన్ చొక్కాలో నోట్లతోపాటు చూపుల్లో కల్చరూ, నవ్వుల్లో మంచీతనవూ పుష్కలంగా కనిపించేయి నాకు.

ఇంతలోనే టేబిల్ తుడవడానికి క్లీనరొచ్చాడక్కడికి. టేబిల్ తుడిచేసి నీలం టెర్లిన్ చొక్కా వేపు కాస్త భయంగా చూసి ఆకుర్రాడు వెళ్ళిపోయాడు. టెర్లినాయన ఆ కుర్రాడిపక్క అసహ్యంగా చూసి మళ్ళీ నాపక్క చూసి, యేదో అనబోయేంతలో, నేను అందుకొని "పాపం! కుర్రాడండీ. చదుకోవాల్సిన స్టేజిలో ఎంత కష్టపడుతున్నాడో చూసారా" అన్నాను. అప్పుడాయన గొంతు సవరించుకున్నాడు. నాపక్క అదోలా చూసి "మీకేవీఁ తెలీస్సార్. డు యూ థింక్ హి యీజ్ యిన్నోసెంట్? నొనొ....దొంగవెధవ సార్. యిలాంటివాళ్ళందరికీ యిలాగే జరుగుతుం దండి" అన్నాడు.

నే నేదో మళ్ళీ అనబోయేంతలో కాఫీ వచ్చింది. నేను టెర్లినా యనా ఇద్దరమూ కాఫీ తాగేశాము. బిల్లుతను తీసుకోబోతుంటే వారించి నేనే తీసుకొన్నాను. కౌంటర్ దగ్గరికి వచ్చి బిల్లివ్వ బోతున్న నేను ఒక్కసారి రాగిపోయాను.ఎంచేతంటే, టెర్లినాయన నా పక్కనే నుంచొని బలవంతంగా మురికి కాలవలోకి ముంచితీసినట్టు మొహం పెట్టేడు; నేను

తొందరగా బిల్లిచ్చేసి, "యేమ(యిందిసార్?" అన్నాను. ఆయన ఇంకా భీకరంగా మొహంపెట్టేడు. అప్పుడాయన ముఖంలో అయూబ్ఖాన్ పోలి కలు కనబడ్డాయి.

"వాడేసార్! కుర్రవెధవ, వాడేనండీ నో డౌట్" అన్నాడతను.

నేను కాస్త కంగారుపడి "ఏళ్ళి యేమయిందండీ?" అన్నాను.

అంతలోనే నా ఎదురుగా కూర్చున్న తెల్ల పెర్లినాయన "ఏవి(టి గురూగారూ! యేవయిం"దంటూ వచ్చాడు.

"పర్సండీ పర్సు కనబడ్డం లేదు.ఇప్పుడేనండి ఇప్పుడే మాయమైపో యింది"అన్నాడు నీలం పెర్లినాయన కంగారుగా.కాస్సేపాగి"వాడేనండీ ఆ క్లీనరు కుర్రవెధవేనండీ. వాడే అంతపని చేసుంటాడు. వాడి చూపులు చూసారూ? మీరు చూళ్ళేస్సార్ అవి దొంగవెధవ చూపులు" అని రొప్పు తున్నాడు నీలం పెర్లినాయన.

"జ్ఞాపకం తెచ్చుకోండి. పర్ససలు తెచ్చారా?" అన్నాన్నేనతని నోట్ల వేపు చూస్తూ.

"తెచ్చానండి బాబూ తెచ్చాను," అన్నాడత న్నావేపదోలా చూస్తూ.

యింతలోనే జనం పోగై మావేపదోలా చూస్తున్నారు. వో రెండు సెకండ్లు పోయాక "ఐతే వాణ్ణీడ్చుకురండి." అన్నారెవరో గుంపులోంచి.

"వానదేమం ఏది" అంటూ నీలం పెర్లినాయన వెళ్ళి ఆ కుర్రాణ్ణి ఈడ్చుకొచ్చాడు. "ఇక్కడొద్దు బయటకు పదండి. రోడ్డుమీదే తేల్చే ద్దాం" అన్నాడు పెర్లినాయన. అప్పుడా పదేళ్ళకుర్రవాణ్ణి పదేనుగుల బలంతో ఈడ్చుకొచ్చారిద్దరున్నూ. అప్పుడా కుర్రాడి కళ్ళు మాత్రం నా పక్క దీనంగా అతి దీనంగా, జాలిగా అతి జాలిగా చూడ్డం తెలుసు నాకు. కాని నేనేవీ( చేయలేకపోయాను. 'ఎంచేత' అని ప్రశ్నించుకొంటే ఒకే జవాబుంది. నేనూ ఈ సోషియాలిస్టిక్ పేటర్న్ ఆఫ్ సొసైటీలో మెంబర్నే అని. నేనూ వాళ్ళతో బైటకి నడిచాను. ఆ తర్వాత మా చుట్టూ జనం గుమిగూడేరు.

"యేరా రాస్కెల్! చెప్పు. పర్సెక్కడ?" అంటూ నీలం షెర్లీనాయన అతని చిరిగిన కాలరు పట్టుకొని గద్దిస్తున్నాడు. ఇంతలో తెల్ల షెర్లీనాయన "ఇలా లాభం లేదుసార్!" అంటూ చెయ్యెత్తాడు.

ఒక్కసారి కాలం స్తంభించి నట్టయింది. నా గుండెల్నెవరో ఇనుపపిడికిలితో నలుపుతూ వుంటే ఆ కుర్రాడి పక్క దేవుడిచ్చిన ఈ కళ్ళతోనే - అతి శ్రద్ధగా చూసేన్నేను. అతన్ది పదేళ్ళ వయసై ఉంటుంది. ఆ చొక్కా రైలుకింద చచ్చిపోయిన వాళ్ళ నాన్నదై ఉంటుంది ఆ జుత్తు మాత్రం వారాల తరబడి నూనెలేనిది. దైన్యమే తప్ప ధైర్యం లేనివి, కన్నీళ్లే తప్ప కాఠిన్యం లేనివి. అతని చొక్కా తెల్లదై వుండొచ్చు, అప్పుడు మాత్రం మట్టిరంగులో వుంది. శరీరం చిరిగిన చొక్కాలోంచి దుమ్ములు, జాలిని, భయాన్ని పూసుకొని అతి వింతగా దీనంగానూ కనిపిస్తూంది. ఆపకుండా కన్నీరు కారుస్తూ, ఎవరికాళ్ళు దొరికితే వాటిని పట్టుకుని తనకేమీ తెలియదని వేడుకుంటున్న ఆ కుర్రాడి కళ్ళల్లో నాక్కనిపించిన జాలి, ఆ మాటల్లో వినిపించిన ఆక్రందన, ఆ చేష్టల్లో కనిపించిన దీనమైన అమాయకత్వమూ ఇవన్నీ నాగుండెల్చుట్టూ జాలితో నిండిన నిస్సహాయతనీ కమ్మించేయి. నేనొక్కసారి కళ్ళు మూసుకున్నాను.

ఇంతలోనే 'ఛెళ్ళ'మని దెబ్బ వినిపించింది. ఆ తర్వాత చాలా సార్లు దెబ్బలు, వాటి వెనుకే ఆ కుర్రవాడు అమ్మనీ, దేవుడ్నీ తల్చుకొని వేసిన కేకలు-అతి భయంకరంగా, అదేదో లోకంలోంచి వినిపించినట్లు అనిపించింది నాకు. వెంటనే కళ్ళు తెరచి నీలం షెర్లీనాయన చెయ్యిపట్టుకున్నాను.

"వదలండి! మీకు తెలీస్సార్! మనుషుల్లో నిజాయితీ చచ్చిపోయిందండీ. లేకపోతే కుర్ర లంజాకొడుకింత పన్చేస్తాడా స్సార్? ఇందుకే ప్రపంచమిలా వుందిసార్. ఇలాటి వాళ్ళని దయతల్చకూడదస్సార్. వదలండి వదలండి" అన్నాడతను. అని నేనొదిలేదాక ఊరుకోలేదు. ఆయనే విడిపించుకొని ఇంకా కొట్టనారంభించాడు. ఆశ్చర్యమేమిటంటే ఆ గుంపులో ఎవరూ 'సార్! యేమిటి అత్యాచారం! కుర్రవాణ్ణిలా యిలా కొట్ట

డం న్యాయమేనా? వాడే పర్సు తీసినట్టు నిర్ధారణ యేమిటి' అనడగలేదు. అందరూ సర్కస్ చూస్తున్నట్టు ఆత్రుతగా చూస్తున్నా రీవిషయాన్ని. ఆ కుర్రాడు మాత్రం వో సారి దవడని మరోసారి వీపుని భయంభయంగా తడుపుకుంటున్నాడు. నేను మళ్ళీ కళ్ళు మూసుకున్నాను.

ఇంతలోనే 'సార్' అన్న కేకవిని హోటల్ పక్క తిరిగేరు. ఇందాక మాకు సర్వ్ చేసిన సప్లయర్ గాభరాగా వస్తున్నాడు. అతని కళ్ళలో కంగారూ, చేతిలో పర్సూ వున్నాయి. అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"మీ పర్సుసార్! కుర్చీ వెనుక పడిపోయుంది. నేనలా లోపలికి వెళ్ళాను. ఇంతలోనే గొడవౌతుందనెవరో చెప్పారు. ఇప్పుడే దొరికింది సార్" అని చాలా కంగారుగా చెప్పాడు.

నీలం షెర్లీనాయన ఓ రెణ్ణిమిషాలు సర్దుకున్నాడు. చిత్రంగా, అతి చిత్రంగా కదిలేడతను. జేబులోంచి కేప్టెన్ సిగరెట్టు తీసి వెలిగించాడు. ఆ సర్వరు దగ్గిరికి వెళ్ళి పర్సు తీసుకున్నాడు.అతని భుజం మీద తట్టాడు. పర్సు తెరచి లెక్క చూసుకుని తృప్తిగా నిట్టూర్చి, వో పది పైసలు తీసి సర్వరు కియ్యబోయాడు. "ఒద్దుసార్!" అంటూ మొహ మాట పడ్డాడు సర్వర్.

"పర్వాలేదుంచవోయ్!" అంటూ అతనే బలవంతంగా ఆ పదిపైసలతని చేతిలో వుంచాడు.

అప్పటికే గుంపు చెదిరిపోయింది. "చూసారా సార్! మనుషుల్లో నిజాయితీ ఇంకా చచ్చిపోలేదు. అందుకే ప్రపంచమిలాగేనా వుంది" అన్నాడతను నవ్వుతూ. అని, "వస్తాన్సార్! అయామ్ లక్కీ హ!హ!హ!" మెల్లిగా నడుస్తూ వెళ్ళిపోయాడు. అలా పర్సు జేబులో పెట్టుకుని నడుస్తూ వెళ్ళిపోయిన ఆయన్ని చూస్తే నాకు నాగరికతను తోడుగా తీసుకుని దానవత్వం వెళ్ళిపోయినట్టనిపించింది.

రోడ్డు దాదాపు నిర్జనంగానే వుంది.

నే నాకాశంవేపు చూసేను. వర్షవాఁగిపోయి చాలా సేపయ్యింది. ఇంతలో జ్ఞాపకవొఁచ్చి పక్కకి చూసేను. ఇందాక దెబ్బలుతిన్న క్లీనరు కుర్రాడు పక్కనే వున్న కిల్లీబడ్డీకి మూల కూర్చొని యేడుస్తున్నాడు. "సార్! ఇతని మాటేమిటి!" అని మనసులోనే గట్టిగా అరిచేన్నేను.... జవాబు రాలేదు.

మెల్లిగా అక్కడికి నడిచేను. అతను తలెత్తేడు. అతని మూతి చుట్టూ దవడమీద రక్తం.ఇంకా చొక్కామీద కూడా ఎర్రని డాగులు, కళ్ళలో కరిగిపోయిన నీళ్ళు. నా కతన్ని చూస్తే చాలా బాధా, జాలి కూడా వేసాయి.

యేం చేయడం? యేం చేయడం? వెర్రిగా జేబులు తడుపుకున్నాను. దీనంగా వో పావలా కాసు మాత్రం చేతికి తగిలింది. వెంటనే దాన్ని బయటకు తీసి ఆ కుర్రాడి భుజం మీద తట్టాను. అతన్నాపక్క భయంగా చూశాడు. నేనా పావలాకాసును అతనిపక్క జూపి తీసుకోమన్నట్టు తలూపాను. అప్పుడతను నాపక్క పామున్చూసినట్టు చూసేడు. ఇంకా ఎలాగ చూసాడంటే కూటికి గతిలేక మొదటిసారి ఒళ్ళమ్ముకునేందుకు సిద్ధపడ్డ పదహారేళ్ళమ్మాయి—మొదటిసారి తన్ను కొనుక్కొని మీదకొస్తున్న యేనుగులాటి షిప్పు దొరవేపు చూసినట్లు—పదిరోజుల్నించీ తిండిలేని వాడు కత్తి పట్టుకొని మీదకొస్తున్న నియంతృత్వంవేపు చూసినట్లు నావేపు చూసాడతను. చూసి, లేని వోపిక తెచ్చుకుని కుంటుతూనే పరిగెత్తేడతను.

ఎక్కడికి?....యేవోఁ....!

అప్పుడైనతన్ని పిలుద్దామనుకున్నాను. కాని యుగయుగాల్నించీ మానవత్వపు పొరవెనుక అణిగిపోయి, కరిగిపోయిన ఆ హృదయ విదారకమైన కేక నా గుండెల్లోన్నే అణిగిపోయింది. కాని—బైటికి రాలేదు. ఒక్కసారి కళ్ళు మూసుకున్నాను. చీకట్లో యేదో అర్థంకాని భాషలో

అస్పష్టంగా రోదిస్తున్న లక్షలాది ఆకారాలు అతి భయంకరంగా, నర్తిస్తూ కనిపించేయి నాకు.

కళ్ళు తెరచి అప్పుడే మెరిసిన కన్నీళ్ళలోంచి ఆ కుర్రాడు నిల్చున్న చోటు వైపు చూశేను.

మానవత్వానికీ, లేకపోతే—మానవత్వంలో దేవత్వానికి, నాగరికతకీ గుర్తులుగా రెండు రక్తపుబొట్లు ఎర్రగా మెరుస్తూ కనిపించాయి నాకు.

* * * *

దేవుడున్నట్టేనా?

వున్నట్టే మరి.